# కీచక వధ

ఊరికి ఉత్తరంగా పెద్ద నడబావి. ఆ నడబావికి ఈశాన్య వైపుగా కనుచూపు మేరలో కానమాకుల మోటబావి. ఆ మోటబావి 'దోర్నంపట్టెడ' మీద నిలబడ్డాడు సిద్ధులుగాడు. ఎడమ కాలిని ఎత్తి దోర్నంపట్టెడ మధ్యగా బిగించిన రెండు చెవుల్లో ఒక చెవిమీద పెట్టాడు.

అది ఎనిమిది మట్ల లోతు బావి. ఆ బావిలో నాలుగుమట్లవరకు నీళ్ళున్నాయి. గుండెల్లో నుండి ఎగదన్నిన ఆనందం వెలుగుగా మారి వాడి ముఖం జేవురించింది. ఆ వెలుగు చంద్రనిప్పులు చెరుగుతున్న నడిమిట్టమీది సూర్యుడి వెలుగుతో పోటీ పడుతూ ఉంది.

ఒక్క సారి వాడు చుట్టూ కలయచూశాడు!

మండుతున్న ఎండ ధాటికి పైరు పచ్చలు మూతులు ముడిచి తలలు వాల్చాయి. గువ్వా గట్రా చెట్ల ఆకుల మాటుల్లో చేరి మాగన్నుగా నిద్రపోతున్నాయి. గొడ్డుగోదా చెట్ల క్రింద గోములాడుకొంటున్నాయి. మిట్ట మధ్యాహ్నం. మనిషి అలికిడి లేదు. ఎండ తాపంతో ప్రకృతి పల్లెత్తడం లేదు.

సిద్ధులుగాడు మాత్రం అనందంతో ఊగిపోతున్నాడు. వాడు అంటున్న మాటల్ని వినడానికి ఆరోజు చుట్టుప్రక్కల మానవ మాత్రుడు లేడు. అందుకే వాడికి ఎక్కడలేని ధైర్యం వచ్చింది.

"ఒరే ముదనష్టపు ముండ నాకొడకల్లారా!...మా యబ్బల చెమట తింట్రి. మా యబ్బబ్బల చెమట గుటగుటమని తాగితిరి. ఇప్పుడేమో తోడుకు మా చెమటతో తానమాడతానంటా ఉండారు. ఇదంతా సాల్దని మా ఆడపడుచులు కావాల్నా పక్కల్లోకి? వస్త్రారా!... వస్తారు!! - వచ్చుండ్లా!... హ్హహ్హహ్హ!!" -

నిప్పులు /కక్కుతున్న ఎండలో దోర్నంపట్టెమీద నిలబడి వికటంగా నవ్వాడు. నవ్వుతూ ఎగిరి బావిలోకి దూకాడు.

'దభిల్లు' మన్న శబ్దంతో బావిలో అలలు రేగాయి. రేగిన అలలు దొరువుల్ని తాకి

బావిలో అల్లకల్లోలాన్ని సృష్టిస్తున్నాయి.

అంత ఎత్తునుండి దూకడంతో సరాసరి అడుక్కు వెళ్ళాడు సిద్ధులుగాడు. అడుగుతాకి చివ్వలా నీళ్ళపైకి వస్తున్నాడు. చేతులతో కాళ్లతో నీళ్లను కసితీరా కొడుతున్నాడు.

"గంగాబవానీ! నిన్నేమో ఈస్వరుడు ఎత్తి నెత్తిన్నే బెట్టుకుంటే నువ్వేమో మాలాంటోల్లని కడుపున బెట్టుకుంటా ఉండావ్? వాణ్ణిగాదే గుటుక్కమని మింగేసేదానికి! ... ఏదీ నాజోలికి రా చూద్దాం?"...

బావిలో నీళ్లతో సవాలు చేస్తూ బావిని మూడు చుట్లు చుట్టుతున్నాడు.

ఆ తరువాత గబగబా గట్టుపైకెక్కుతున్నాడు. ఒక్క లగువుతో దోర్నంపట్టెపైకి ఎక్కుతున్నాడు. దర్జాగా నిలబడుతున్నాడు. అటు ఇటు చూస్తున్నాడు. ఎవ్వరూ కంటబడక పోయేసరికి తెపరాయిస్తున్నాడు!

"ఒరేయ్! కొంపల్లో లచ్చణంగా కూసోని తినే కుండాకోరు యదవల్లాలా! ఎల్లకాలం చీకట్లోనే వుంటారనుకోవద్దండిరా! మా గుడిసె బతుకుల్లో కూడా ఎప్పుడో ఒకప్పుడు పొద్దు మొలవనే మొలిస్తింది!" అని అంటూ మళ్లీ బావిలోకిదూకుతున్నాడు. పూడును తాకుతున్నాడు. 'రఁయ్' మని పైకి లేస్తున్నాడు. "వాణ్ణి గాదే కడుపున పెట్టుకునేదానికి!" అని కాళ్లూ చేతులతో బావిలోని నీళ్లను దబదబా ఇష్టమొచ్చినట్లు బాదుతున్నాడు. బాదుతూ బావిని నాలుగు చుట్లు వేస్తున్నాడు!

మళ్లా గబగబా గట్టుపైకి ఎక్కుతున్నాడు.

దోర్నంపట్టెమీద దర్జాగా నిలబడుతున్నాడు.

అక్కసుతీరా కడుపుమంటను కక్కుతున్నాడు.!

ఆ మీదట బావిలో దూకుతున్నాడు. దూకి దూకి కాళ్లతో చేతులతో నీళ్లను కసితీరా బాదుతున్నాడు.

గబగబా గట్టుపైకెక్కడం... ఎగిరి దోర్నం పట్టెపై నిలబడడం... నోటికి వచ్చినట్లు కాసేపు వాగడం... బావిలో దూకడం... కాళ్లు చేతులతో నీళ్లను కసితీరా బాదడం!...

పూనకం పూనినట్లు... ఎంతసేపు తిట్టినా... ఎన్ని సార్లు బావిలో దూకినా... ఒంటిపై మంటలు చల్లారనట్లు బావిలో దూకుతూనే ఉన్నాడు సిద్ధులుగాడు.

* * * *

అది ఒక పల్లె!

"ఆ పల్లెకు ఎటు వెళ్లాలి?"అని దారిన పోతున్న ఎవరినైనా నిలబెట్టి అడిగితే కాసేపు తటపటాయించి...తీరిగ్గా తలగోక్కొని నసుగుతూ నసుగుతూ చెపుతాడు-మూడు బస్సులు మారి ఆ పైన నాలుగు మైళ్లు కాలికి కాలు కొట్టుకొంటూ నడిస్తే ఆ పల్లె కనపడుతుందని!

"మనకు స్వాతంత్రం వచ్చి నాలుగు దశాబ్దాలైనా ఈ దేశంలో పల్లెలగతి ఇలా ఏడ్చిందా? అయ్యో పాపం" అని బయలుదేరబోతుంటే అతడే చేతులు పట్టుకొని నిలబెట్టి-

"అయ్యా! మాపల్లెకు మోటారు చేరకపోయినా పంచాయితీ వాళ్ల రేడియో చేరింది. గవర్నమెంటు సారాయి చేరింది. రకరకాల సిగరెట్లు చేరాయి. రాజకీయాల సిగపట్లు వెలిశాయి! బీడీలు చేరాయి. పొగాకు ముక్కుపొడి మాత్రం ఆ ఊరు పుట్టినప్పటి నుండి ఉండాయి." అంటూ పకపకా నవ్వుతాడు.

అలాంటి పల్లెలో అప్పటికి సరిగ్గా నెలరోజుల కిందట!

వెన్నెల వెల్లువలా ఆ పల్లెమీద పడింది.

రచ్చబండ దగ్గర తీరిగ్గా కూర్చుని కొందరు బీడీలు కాలుస్తున్నారు. మారి కొందరు కాళ్లు బారసాచి హాయిగా కూర్చొని ఆదమరచి పొగాకు నములుతున్నారు. ఈ అలవాట్లకు లోనుకాని వాళ్లు మాత్రం దుప్పట్లకు లోనయ్యారు.

ఆ ఊళ్లోనే రాములవారి గుడి ఉంది. గుడిలో దేవుడే ఉన్నాడు. ఆ దేవుడి ముందు నిలబడి ఎటువంటి అబద్ధమైనా ధీమాగా చెప్పగల మనిషి రచ్చబండ వద్ద నిలబడితే నీళ్లు నముల్తాడు.

అది రచ్చబండ మీద భక్తితో కాదు. బసిరెడ్డి మీద భయంతో!

రావి చెట్టుకింద రచ్చబండ మీద పొడలు పొడలుగా పడుతూ ఉంది వెన్నెల. రాగి ఆకుల సందుల్లో దూరిన చల్లగాలి సంగీతం వినిపిస్తూ ఉంది. విశాలమైన నల్లరేగడి నేలమీద అక్కడక్కడా ఆరవేసిన తెల్లటి దుప్పట్లు గాలికి కదులుతున్నట్లు మేఘాలు కదలలేక కదులుతున్నాయి.

రచ్చబండ దగ్గరికి బసిరెడ్డి రాచఠీవితో వచ్చాడు.

చేతుల్లో సిగరెట్లు చేతుల్లోనే నలిగిపోయాయి. నోట్లోని బీడీలు జారి కిందబడ్డాయి. దుప్పట్లు సర్దుకొని లేచి నిలబడ్డాయి.

బసిరెడ్డి రచ్చబండ మీద ఆసీనుడయ్యాడు.

రెడ్డిగారలా కూర్చుంటే - ఆయనగారి దర్పమూ దర్జా ఆ రచ్చబండ మీద ఓ పరిధిని గీస్తాయి. అంతో ఇంతో వెసులుబాటున్న వాళ్లు ఆ రచ్చబండమీదనే కూర్చున్నారు. అడుగులకు మడుగులొత్తే అవకాశవాదులు ఆయన సన్నిధిలో అంత చోటు సంపాదించుకున్నాయి.ఎటూ కానివాళ్లు వీధిలో నేల మీద ఇంటి ముందరి అరుగుల మీద కూర్చున్నారు. రెడ్డిగారు విసిరేసిన మెతుకుల్ని ఏరుకొని తినే 'పడుపుకూటిగాళ్లు' రెడ్డిగారి అంగరక్షకుల్లా నిలబడి మీసాలు మెలివేస్తూ రెడ్డిగారి దర్జాను చాటుతున్నారు.

రచ్చబండకి రవ్వంత దూరంలో ఓ నడికారు ఆడది నిలబడి ఉంది. ఆమె చూపులు నేలను తొలుస్తున్నాయి. రెడ్డిగారి చూపులు మాత్రం అప్పుడప్పుడూ ఆమెను పరామర్శిస్తున్నాయి. ఓ అమ్మాయి అబ్బాయి ఆమె బిడ్డలేమో? కాళ్లకు చుట్టుకొని నిలబడి ఉన్నారు.

జామురాత్రికే ఆ పల్లెలో రెండు జాముల వాతావరణం చోటుచేసుకొనింది.

రచ్చబండ దగ్గర మౌనం మేలమాడుతూ ఉంది.

అక్కడ కూర్చున్న అందరూ ఆలోచిస్తున్నారు. తలకొక తీరుగా ఆలోచిస్తున్నారు. అయితే అందరి ఆలోచనలు ఒకే తీరుగా కొనసాగుతున్నాయి. ఆ ఆలోచనలన్నీ 'పాతప్పలోడి' మీదే.

రెడ్డోరి సేద్యగాడు కాకముందు వాడి పేరు వెంకట్రాయులు!

వెంకట్రాయులు అందరి లాగానే పుట్టాడు. అల్లారు ముద్దుగా కాకపోయినా ఉన్నంతలో అంతో ఇంతో గారాబాలు తిని పెరిగాడు. పెళ్లి చేసుకున్నాడు. ఓ బిడ్డ తండ్రి కూడా అయ్యాడు. అయితే మాత్రం వాడి లోకంలో ఎలాంటి గుర్తింపుకు నోచుకోలేక పోయాడు.

ఒక్కబిడ్డ తండ్రి అయిన తర్వాతనే వాడు రెడ్డోరింట్లో అడుగు పెట్టాడు. అడుగు పెట్టిన వేళావిశేషం ఏమిటో కానీ-కుక్కలు వాడి దగ్గర విశ్వాసం నేర్చుకొన్నాయి. ఆ ఊరి కోళ్ళు వాడి కూతతో మేలుకొన్నాయి.

సేద్యగాడంటే కూలోడే. అయితే వెంకట్రాయులు మాత్రం ఎప్పుడూ కూలి సేద్యం చేయలేదు. ఆ ఊళ్ళో వాడి కూలి సేద్యం సొంత సేద్యంతో పోటీ పడింది.

ఊళ్ళో వాళ్ళ దృష్టి వాడి మీద పడింది.

'దిష్టి' తగిలిందని కాసిన్ని ఉప్పురాళ్ళో...మిరపకాయలో....దిగదీసి వేయడానికి వెంకట్రాయులికి వాళ్లమ్మ లేదు. ఆలికి ఆ అవకాశం ఎంత ఏడ్చి మొత్తుకొన్నా దొరకదు.

వెంకట్రాయులు నిద్ర లేస్తాడు. బానా మోకు భుజంమీద పెట్టుకుంటాడు. జోడెద్దుల పగ్గాల్ని ఒకచేత పట్టుకుంటాడు. నాగులమిట్ట బావిలో మోట కడ్తాడు. మోట తోలుతూ 'రామన్న రామో!' అని పాట అందుకొంటాడు.

ఆ పాట చెవిని పడటంతో ఊళ్ళో తొలి కోడి బద్ధకంగా ఒళ్ళు విరుచుకొంటుంది. 'ఔరా! వెంకట్రాయులూ!' అని ఆశ్చర్యపడి వాడి స్వామి భక్తికి ఆనందపడి రెక్కల చేతులు తట్టుతూ కూత వేస్తుంది.

ఆ కూతతో ఊరు ఉలిక్కిపడుతుంది. ఆదరాబాదరా పైకి లేస్తుంది. తట్టా బుట్టా సర్దుకుంటుంది ఆ నాటి పనీపాటా కోసం.

తూర్పున పటమెగిరే సరికి ఆ బావి కింద మడికి తడి వేస్తాడు. మరో బావి కింద దుక్కి దున్నడానికి ముందు మడక పట్టతాడు. మూడో నాలుగో వెనక మడకలు వెంట పడలేక సంకట పడుతూంటే 'ఒరే వొరే! సోమారిపోతు నాయాండ్లాలా! అట్లా తూగతా ఉండారెందుకురా? అదిలించదలించి కొట్టి మడక ఎంటెంటనే రారాదూ!' అని మాటిమాటికీ మందలిస్తుంటాడు.

రెండు బార్ల పొద్దెక్కే సరికి రెడ్డమ్మ సద్ది పంపుతుంది.

మడకలు నిలబెడతారు!

మడకలు అలా నిలబెట్టీ నిలబెట్టక ముందే వెంకట్రాయులు ఒక్క ఉరుకులో దరిదాపుల్లో ఉన్న మోటబావి దగ్గరికి పరిగెత్తతాడు. ఆ కాలవలో పారుతున్న నీటి అడుగున పేరిన సన్నని యిసుకను రెండు చిటికలు తీసి నోట్లో వేసుకొంటాడు. ఇటు రెండు సార్లు అటు రెండు సార్లు చూపుడు వ్రేలిని పోనిచ్చి పండ్లు తోమిందయిందనిపిస్తాడు. దోసెడు

నీళ్ళని రెండు సార్లు పుక్కిలించి ఊస్తాడు. ఆ తడి చేతులతోనే మొగాన్ని అలా తుడుచుకొంటాడు. తలకు చుట్టిన తుండుగుడ్డను విప్పి మొలకు చుట్టుకొంటాడు. తూర్పు వైపు తిరగతాడు. రెండు చేతులు జోడించి సూర్య భగవానుడికి దండం పెడతాడు.

మూడుసార్లు చేతులు పైకెత్తి జోడిస్తే పూజ ముగిసినట్లు!

ఆ తరవాత ఆ కాలవ గెనిమి మీదే కూర్చుంటాడు.

రెండు దోసిళ్ల సద్ది రెండు క్షణాల్లో తాగినట్లనిపిస్తాడు.

అప్పటికి వెనక మడకలు దున్నుతున్న కూలోళ్ళు ఆ గనిమ ఈ గనిమ తిరిగి పళ్ళు తోముకోవడానికి 'గుంటగంజేరాకు'ను అంత పెరుక్కొని నిక్కుతూ నీలుగుతూ కాలవ దగ్గరికి వస్తారు.

వెంకట్రాయులు వాళ్ళ మీద ఒక్కసారిగా విరచక పడతాడు.

"ఇదేందిరా నీతో పెద్ద పాటుకైపోయిందే! ఒక వక్క కొరికినంతసేపు లేదు మడకలు నిలబెట్టి! మొకమట్లా కడుక్కోవాల్నా పన్లేదా?...సద్దంత నోట్లో పోసుకోనిస్తావా? లేదా?"

విసుక్కుంటారు వెనక మడగ్గాళ్ళు!

"మడకల్నిప్పేసి నేను మాత్రం మొకం కడుక్కోలేదో?...సద్దాగలేదో? మీరు చెప్పేది బలే యిచిత్రంగా ఉండాదే?" రెట్టిస్తాడు వెంకట్రాయులు.

"ఒరే నీకంటే గాచ్చారం పట్టిందిరా పాతప్పులు తీర్చాలని! మాకేం పట్టింది? మీ రెడ్డి పితికే పితకడానికి చేసే ఈపని సాలు సాల్లే!"

తమ అభిప్రాయాల్ని వెనకేసుకొస్తాయి వెనక మడకలు!

"అయితే నేను పాతప్పులోడనా మీరనేది?"

"మేమన్లేదు గాని...నువ్వే అంటావుండావు. అరెరె! బలే కుదిరిందిగదరా పేరు! 'పాతప్పులోడు' గలగలా నవ్వాయి వెనక మడకలు.

ఏరోజు ఏ వేళప్పుడు జరిగిందోగాని ఈసంభాషణ-వెంకట్రాయులు అన్న పేరు వెనకబడి 'పాతప్పులోడు' అన్న పేరు ముందు పడింది. ఆ తరువాత ఆ పల్లె నోట్లో పడింది.

పాతప్పులోడు అనబడే ఈ వెంకట్రాయులు ఓ రోజు తెల్లవారు జామున నాగులమిట్ట బాయిలో మోట తోలుతున్నాడు. నిండు బాన పైకి వస్తుంటే అనుకోనట్టుగా మోకు తెగింది. మోకు మీద కూర్చున్న పాతప్పులోడు 'దభీ' మని కింద పడ్డాడు. ఒక ముంపు మీద ముందుకు వెళ్తున్న ఎద్దులు బారిలో బోర్లగిలా పడ్డాయి. బాన బావిలో పడింది.

అదరాబాదరా పైకి లేచాడు పాతప్పులోడు. దుమ్ము దులుపుకున్నాడు. వీపుదట్టి ఎద్దుల్ని సేద దీర్చాడు. ఆ మీదట ఒక్క క్షణం నిలబడి ఆలోచించాడు.

ఆ పాయకట్టులో ఏ బాయిలో ఏది పడినా తాను బావిలో మునిగి ఆ వస్తువును పైకి తేవలసిందే!

అలాంటప్పుడు తన బావిలో తన బానే పడింది.

వాడు వెనకా ముందు చూడలేదు. చీకటిని లెక్కబెట్టలేదు. గబ గబా బావిలోకి దిగాడు.

తల క్రిందికి పెట్టి కాళ్లు పైకెత్తి 'సారమునక' వేశాడు, బావి అడుగులో వున్న బానను పైకి తేవడానికి!

నీళ్లలో చేపలా బావిలో దూసుకు పోతున్నాడు. ఎండ పొద్దున అయితే నీలి రంగు నీళ్లలో కూడా కాసంత వెలుతురున్నట్లు కనిపించేది. అసలే చీకటి. నల్లని నీళ్లలో చీకటి. చిమ్మచీకటిలో ఏమీ కనిపించని స్థితిలో ముందుకు దూసుకుపోతున్నవాడు సరాసరి బానలోనే దూరాడు. బాన యినప గుండ్రానికి అమర్చిన నాలుగు కమ్ములు అడ్డదిడ్డంగా ఉంటాయి. ఆ కమ్ముల మధ్య తల ఇరుక్కొనింది.

శక్తి కొద్దీ పెనుగులాడాడు. విలవిలా కొట్టుకున్నాడు. కమ్ముల సందుల్లో ఇరుక్కున్న తల వీడి రాలేదు. అమాంతంగా బానను అలానే పైకి తేవాలన్న ప్రయత్నం ఫలించలేదు.

పాతప్పలోడి ప్రాణాలు నీళ్లలో కలిసిపోయాయి.

వాడి చావుతో వాడిమీద ఆధారపడి బ్రతుకుతున్న వాడి పెండ్లాం పిల్లలు వీధిన పడ్డారు. అది చూచి, వాడికేదో అన్యాయం జరిగిపోయిందని ఊళ్లో నలుగురూ నాలుగు విధాలుగా అనుకుంటున్నారు.

ఆ మాటలే రెడ్డిగారి చెవిలో పడ్డాయి.

ఈ చెవిలో పడిన మాటల్ని ఆ చెవిలో వదలడానికి రెడ్డిగారు చేతగాని వాడేమీ కాదు.

చేతగానివాడు చేతులు ముడుచుకొని కూర్చుంటాడు. లేకుంటే ఎవరి కర్మ వాడనుభవిస్తాడని కర్మ సిద్ధాంతంపై పడతాడు.

కానీ రెడ్డిగారు మాటపడే మనిషికాదు. మాటన్నవాడిని మర్యాదగా పిలిపించి, వాడి వేలితోనే వాడి కన్ను పొడిపించి, 'అయ్యో! కన్ను పొడుచుకున్నావా!' అని ఆదర భావాన్ని ప్రకటించే మహాలౌక్యుడు బసిరెడ్డి.

అందుకే అంత రాత్రిపూట రచ్చబండ దగ్గర మద్దిస్తం కోసం మందిని చేరవేశాడు.

బసిరెడ్డి గొంతు సవరించుకొన్నాడు.

అందరూ చెవులు రిక్కించి, రెడ్డివైపు చూపులు తిప్పారు. వెలివేసినట్లు దూరంగా నిలబడి ఉన్న నడివయసు ఆడది ఒక్కసారి తల పైకెత్తి రెడ్డిగారి వైపు చూసి, మళ్లీ తల దించుకొనింది.

"దేవుడికి దయలేదు. ఉంటే ఇట్లా నా కుడి బుజమే పడిపోతిందా? ఒక కన్ను కన్నుగాదు. ఒక చెయ్యి చెయ్యిగాదు- అన్నారు పెద్దోళ్లు. ఒక చేతిని పోగొట్టుకొని నేనిట్లా అల్లాడతా ఉంటే, ఈ అడ్డదిడ్డమైన మాటలు! రామ రామ! చచ్చిన వాడెట్లా వెంకట్రాయులు ఒక్క దినంతో చస్తే ఈ మాటల్ని పడలేక నేను దినమూ చస్తా ఉండాను!"

తనలో తాను అనుకున్నట్లుగా అందరికీ వినబడేలా అన్నాడు బసిరెడ్డి. ఆ పై ఓ నిట్టూర్పు విడిచాడు భారంగా.

"మీరంతా అంటావుండేది ఏమిటంటే!"

"తొలికోడి కూతకు ముందే వెంకట్రాయులు మోట కట్టేవాడని!"

"నిజమే! నేను కాదనల్లేదే!"

"ఇక పోతే వాడు ఎప్పుడు తింటాడో ఎప్పుడట్లా పడి లేస్తాడో ఆ దేవుడికే ఎరిక. ఎప్పుడు చూసినా ఏదో ఒక పని చేస్తావుండె గదా?అని!"

"అవును. చెయ్‌లేదని నేను చెప్పలేదే!"

"అలాంటివాడు అయ్యోపాపం అన్యాయంగా మా మోటబానలో ఇరుక్కొని పెరుక్కోలేక చచ్చిపొయ్‌నాడే" అని.

"అవును. అయితే ఎవురి బాన ఏ బావిలో పడినా ఏ కదురుగోలు ఏ బావిలో పడినా మునిగి ఎత్తిస్తా వుండిందెవురు? వాడేగదా? అటుమంటి సమయాల్లో వాడికి ఇటుమంటి గతే పట్టుంటే?... నాకు తెలియకుండా అడగతా ఉండాను ఎవుడు మాత్రం ఏమి చేస్తాడు? చెప్పండయ్యా!...మీరే చెప్పండి!"

రచ్చబండ వద్ద కూర్చున్నవాళ్లను రాదీసి రాళ్ళేస్తున్నాడు బసిరెడ్డి!

"అది గూడా నిజమే గదబ్బా మరి!" అని రచ్చబండ వద్ద చేరిన జనం ఎవరికి వారు గొణుక్కొంటున్నారు. ఇంకొకరికి వినబడేటట్లు!

"మీరంతా అనుకుంటావుంటారు- వాడా వెంకట్రాయులేదో వొరగబెడితేనే నేనింత వాణ్ణయ్యాను అనీ! వాడు చేసింది మీ కంట్లోబడింది కానీ మేమెంత చేసి వుంటే వాడంత సొంతగాడుగా మెలిగి ఉంటాడన్న సంగతి మీకు తెలియదు. ఎందుకంటే- చేసిన మేలును చెప్పుకునే తత్వం మాయింటా వొంటా కూడా లేదు కాబట్టి! అవసరం వచ్చింది కాబట్టి అంటున్నాను- మా నాయన వాళ్ల నాయనకు తాకట్టు గీకట్టు ఏమీ లేకుండా వెయ్యి రూపాయిలు అప్పు ఇచ్చినాడు."

"ఏమయిందో ఏమో? రాగి మాని మీద తీతువు పిట్ట ఉన్నట్లుండి వికృతంగా అరిచింది.

అందరూ తలలు పైకెత్తి చూశారు.

అంత దూరంలో నిలబడియున్న ఆ నడి వయసు ఆడది కూడా - ఒక్కసారి తలెత్తి ఒక్క చూపు చూసింది రెడ్డిని నమిలేసేటట్లు.

రచ్చబండకు దూరంగా...ఎవరి కంటా కనబడకుండా కూర్చుని...జరుగుతున్న 'బాగోతాన్ని' శ్రద్ధగా వింటున్న సిద్ధులుగాడు కాలుస్తున్న బీడీని విసిరి నేలకేసి కొట్టి కారి ఉమ్మాడు.

"ఏనాడైనా పల్లెత్తి అప్పుమాట ప్రస్తావించినానా? లేదు. వడ్డీ కట్టమని నిల్దీసినానా? లేదు. చేసిన పనికి తీసుకున్న అప్పుకు సరికి సరి సరిపొయ్యిందన్నానా?అడగండి వాణ్ణి!"

అడగవలసిన వాడు అక్కడ లేడన్న సంగతి తెలిసి ఆవేశంతో ఊగిపోతున్నాడు రెడ్డి. ఎవరిని అడగాలో? ఎలా అడగాలో? తెలియక రచ్చబండ తలవంచింది. అదే అదననుకొన్నాడు బసిరెడ్డి!

"పోనీ! అక్కడ నిలబడి ఉందిగదా వాడి పెండ్లాం. దాన్నే అడగండి. ఏనాడైనా వాళ్లకూటికి లోటు చేసినానేమో?"

రెట్టించి అడుగుతున్నాడు రెడ్డి!

నోరు విప్పలేక పోయింది వాడి పెండ్లాం!

కథా నిలయం
4886
శ్రీకాకుళం

వాడి పెండ్లామే నోరు విప్పలేక పోయేసరికి రచ్చబండకు నోరు కదపవలసిన అవసరం తీరిపోయింది.

"పాలస్సంతినే ఇంతమంది పెద్ద మనుషులు ఇక్కడ చేరినారు. బాగుండాది. ఇంత మందిలో ఎంతోకొంత మంది నన్ను గురించి ఏమేమో వాగినారు. అయినా పరవాలేదు. కానీ గవర్నమెంటోళ్లు కూడా ఇచ్చిన అప్పును సాపు చెయ్యరు. చచ్చిన వాడి బిడ్డలకో పెళ్లానికో వెంటనే ఉద్యోగాలివ్వరు. కానీ వాడా వెంకట్రాయులు కార్చిన చెమటను తలచుకుంటా ఉంటే నాకు కన్నీళ్లాగ లేదు. అందుకే వాడి బాకీని మాపు చేస్తుండాను. రేపటి నుంచి వచ్చి వాడి పెండ్లాన్ని ఇంట్లో పని చూసుకోమనండి. అది ఇంట్లో పనీ పాటా చూసుకుంటా ఉంటే దాని బిడ్డలు గొడ్లు గోదా మేపుకుంటారు."

చాలా ఉదారంగా వెలవడ్డాయి రెడ్డిగారి నోటినుండి మాటలు!

వీళ్ల నాయన వాళ్ల నాయనకు అష్టాబాపత్తుగా వెయ్యి రూపాయలు అప్పు ఎప్పుడిచ్చినాడో? ఎందుకిచ్చినాడో? ఇచ్చినదానికి దాఖలా ఏమిటో? అడగలేని రచ్చబండ రెడ్డిగారి ఔదార్యాన్ని అవుననింది.

"మిమ్మల్నిక్కడికి పిలిపించాల్సిన అవసరములేదు. ఇదంతా వివరించి చెప్పాల్సిన అవసరములేదు. రెడ్డోరు మంచోరు కాబట్టి ఇంత ఓపిగ్గా జరిగిందంతా చెప్పినారు. ఇంకెక్కడైనా సరే! ఎవుడైనా సరే! ఇట్లాంటి అడ్డదిడ్డం కూతలు కూసినారో ? అక్కడికక్కడే రాంకీర్తన పాడితింది బుర్ర! జాగర్త!"

మీసాలు మెలి వేస్తూ 'పడుపు కూటిగాళ్లు' వంత పలికారు.

మళ్లీ ఒక్కసారి తుపుక్కున ఉమ్మాడు సిద్ధులుగాడు మనిషి కంట పడకుండా!

మలిజాము దాదాపు ముగుస్తూ ఉంది. ఊరికి దక్షిణంగావున్న మంచినీళ్ల గుంటలో ఎంగ్రకాయలు మెక్కడానికొచ్చిన పొట్టి నక్కలు ఊళలేస్తున్నాయి. కొలిమి చింతమానులో మిణుగురు పురుగులు వెన్నెల్లో వెల వెలపోతున్నాయి. దేవుడి ముందు ధైర్యంగా నిలబడగలిగిన ఆ పల్లె జనం రచ్చబండకు మాత్రం తలవంచి ఒక్కొక్కరుగా యింటిముఖం పడుతున్నారు. "పడుపుకూటిగాళ్ళు" చేతిలో పావలా పరక పడేసరికి అంత రాత్రిలో కూడా గుంట కట్టమీద సారాయి అంగడికి పరుగులుతీస్తున్నారు చలికి తట్టుకోలేక. "పాతప్పలోడి" పెళ్ళాం వెళ్ళిపోతున్న జనం వైపు ఒక్కసారి, రచ్చబండ మీద రాచఠీవి ఒలకబోస్తున్న రెడ్డిగారి వైపు ఒక్కసారి చూసి గిరక్కున వెనక్కు తిరిగి బయలుదేరింది.

ఆ నడివయసు ఆడదాని నడక హొయలు రెడ్డి గుండెల్లో గుబులు రేపింది! దాని ఒంటి మీద ఒంపులు రెడ్డిగారి చెక్కిళ్లపై కెంపులు పూయించాయి! మీసం మెలివేశాడు రెడ్డిగారు!

"ఇద్దరు బిడ్డల తల్లి అయితే కూడా పట్టు సడల్లేదే ఆడదానికి" అనుకున్నాడు. కను మరుగయ్యే వరకు చూస్తూ "చేపగా పుడ్తే ఎప్పుడో ఒకప్పుడు వల్లో పడకుండా పోదు. వలేసి చూద్దాం" అని తనలో తానే నవ్వుకుంటూ బయలుదేరాడు!...

"పడుపుకూటిగాళ్ళు" బుర్రలు బద్దలవుతాయని హెచ్చరించినా - బసిరెడ్డి మొసలి

కన్నీళ్ళు గార్చినా - లోకులు లోకులే! - "పాతప్పలోడి" చావును గురించి చిలువలు పలువలుగా చెప్పుకుంటూ వుండగానే చెప్పకుండా చెందకుండా మూడువారాలు దొర్లిపోయాయి.

ఒకనాటి సాయంకాలం. పొద్దుగూట్లో పడబోతావుంది. నాగులమిట్టబావి ప్రక్కన గడ్డమీద నిలబడ్డాడు బసిరెడ్డి. కోతకు వచ్చిన జొన్నచేలవైపు ఆనందంగా చూస్తున్నాడు.

ఎక్కడున్నాడో? ఏమో? సిద్ధులుగాడు. ఒక్క లగువుతో వచ్చి "దండాలయ్యా!" అంటూ పాదాలమీద పడినంత పనిచేశాడు.

ఒక్క అడుగు వెనక్కువేసి వాడివైపు వాడిగా చూశాడు బసిరెడ్డి. ఆ వాడి చూపుల్లో ఓడిపోయిన కసివుంది. 'వాడెందుకు వచ్చాడా?' అన్న సందేహమూ ఉంది.

"దాని బుద్ధి గెడ్డితిని నానా బూతులు కూసిందంటయ్యా పిచ్చిముండ! నాతో చెప్పి చెప్పి మొత్తుకొనింది. ఇప్పుడెంత బాదపడిపోతా ఉండాదంటే..."

"కూస్తిందిరా కూస్తింది! కూయకేం జేస్తింది? వాడు వెంకట్రాయులుగాడు మూడు పూటలు ముక్కులదాకా మెక్కబెట్తే ... ఒంట్లో యింకా రసి వుండ్లా! అందుకే కూస్తింది. కుయ్‌నీ... గొర్రె కొవ్వేదంతా గొల్లోడికే లాబం!" బసిరెడ్డి కసిగా మాట్లాడుతున్నాడు.

"అయ్యా అయ్యా! అంతంత మాట్లనబాకండయ్యా! ఏదో తెలిసీ తెలవక కూసింది. పెట్నా కొట్నా ఇంకమిందట మీరే గదయ్యా మాకు దిక్కు! మీరే కోపగించుకుంటే మాలాంటోళ్ళ బతుకులేం కావాలయ్యా? రగతం పంచుకోని పుట్టింది. దాని తపన చూళ్లేక తమరి కాళ్ళు పట్టుకుంటుండా!"

కాళ్ళు పట్టుకోకనే కళ్ళ నీళ్ళు పెట్టుకొన్నాడు సిద్ధులుగాడు.

"ఇంతకూ నువ్వనేదేందిరా?" అసహనంగా అడిగాడు బసిరెడ్డి.

"మీరే చెప్పండయ్యా! వాడు సచ్చి నెల దినాలు గూడా తిరగలేదు. అంతలోపల్నే తమరి దాపన చేర్తే, మీరా ఊరుకోరు. మిమ్మల్ని చూసి ఊరా ఊరుకోదు. అందుకేనయ్యా! అదట్లా నోరు పారేసుకోనుంటింది. ఇప్పుడేమో నా రొండు చేతులు గెట్టిగా పట్టుకొని 'కూడా పుట్టిన నేరానికి రెడ్డోరి చెయ్యిపట్టియ్యరా!' అంటా బతిమలాడతా ఉండాది."

గుండెల్లో మంట చల్లారినా రెడ్డిగారిలో బెట్టు తగ్గలేదు.

"సరే చూద్దాం లే రా!" అన్నాడు దర్పంగా.

"అట్లన్నారంటే మీ పాదాలకాడనే తలపగలకొట్టుకోని చస్తానయ్యా! 'నువ్వెందుకే యేడ్చేది పిచ్చినామొకమా! ఈ రేత్రికి రేత్రే రెడ్డోరి పాదాలకాడ నిన్ను పడెయ్యక పోతే నేన్నీతో కూడా పుట్నే లేదనుకో!' అని వారంగా చెప్తానే వుండా దాంతో. ఎట్లెట్టా కాపు కాసినానో ఆ దేముడికే ఎరిక. మీరొంటిగాచిక్కితే గదయ్యా! ఆ ఏడుకొండలోడి దయతో యిప్పటికి దొరికితిరి. ఈ రేత్రికి ఈ తలమింద బొరువట్లా దించి పారేసుకుంటే ఆ మిందట్నే నాకు కంటి మింద రెప్ప పడబొయ్యేది."

"ఈ రాత్రికే ఎట్లారా?" సందేహాన్ని వెలిబుచ్చాడు బసిరెడ్డి.

"అదెంతా మీకెందుకులేయ్యా! నేను చూసుకుంటా గదా! కానమాకల బాయిగెడ్డమింద

గుడిసెలో మంచమేసినా! మంచం మింద చలవ జేసిన దుప్పట్లు పర్చినా. దుప్పిట్ల మింద మల్లెపూలు చల్లినా! ఇంక అదేమో మీ కోసరం ఎదురుచూస్తా కూసోనుంటింది. మీరట్లా ఊరిముందర పెద్దబాయికాడికి రండి. మీకోసరం నేనెదురుచూస్తా వుంటా."

బదులుకోసం నిరీక్షిస్తున్నాడు సిద్ధులుగాడు.

ఎప్పుడెప్పుడని మనసు గంతులు వేస్తున్నా పైకి ప్రదర్శించడం పెద్ద మనుషుల లక్షణం కాదు.

బసిరెడ్డి పెద్దమనుషుల్లో పెద్ద మనిషి.

అందుకే మెడ బిర్రుగానేబెట్టి తలను మాత్రం ఆడించీ ఆడించనట్లాడించాడు.

ఎగిరి గంతులు వేశాడు సిద్ధులుగాడు. రెండుచేతులూ జోడించి దండాలు పెడుతూ వెనక్కు వెనక్కే ఏడడుగులు నడిచి ఆతర్వాత తుపాకి గుండులా ముందుకు దూసుకుపోయాడు.

అదూపు మీదనే గుడిసింట్లోకి దూరాడు. దీగూట్లో దాచిపెట్టిన మూడు మామిడి ముట్టెల్ని చేతికి తీసుకున్నాడు. ముసి ముసిగా నవ్వుతూ ముద్దుపెట్టుకొన్నాడు.

తాను వేసుకున్న పథకం . . .ఆ తర్వాత జరగబోయే పరిణామం! - ఊహించుకుంటూ ఉంటే తన పథకానికి ప్రాణం పోసే సంఘటన కండ్లముందు మెదిలింది..

ఆరోజు వాడి బావ మామిడి ముట్టెలతో 'ఉండలు' తయారు చేస్తున్నాడు.

"ఏంది బావా ఈ మామిడి ముట్టెల యవ్వారం?- ఎందుకు బావా ఇంత అవస్త పడ్తావుండావే?" అని అడిగాడు.

"ఈ మెగాలతో పెద్ద పాటుకై పొయ్యిందిరా! - రేత్రిపూట పండిన పంటమింద పడి నాశనం చేస్తా ఉండాయి. ఈ ఉంటల్తో వాటి అంతు చూడాల!"

తాను పక పకా నవ్వాడు.

"ఎందుకురా అట్ట నవ్వతా ఉండావే!"

"ఏమాట చెప్పినా నమ్మేటట్టుగా ఉండాల. మామిడి ముట్టెల్తో మెగాల అంతు చూసేదంటే? ... నమ్మమంటావా?"

"ఒరే పిచ్చినాయాలా! - ఈ ముట్టెల్లో ఉండే పప్పును తీసేసినానా? - దానికి బొదులుగా పెట్లుప్పు... గెందకం... నల్లమందు తగు పాళ్లల్లో కలిపి ఉంటలు చేసి లోపల పెట్టాల. ముట్టె యదాపకారంగా కనిపించేదానికి సన్నని నూలు దారంతో సుద్దంగా కట్టాల. ముట్టెపైన కొంచిం సియ్య అతికించి పెట్టాల. అట్టా మాదిరి తయారు చేసిన ఉంటల్ని గెనాలమింద ఆడొకటి ఆడొకటిగా పెట్టాల. మెగాలు పైర్ల మింద పడేదానికొస్తాయా?- ముక్కులకు సియ్య వాసన తగిల్తిందా! - ఎతుక్కుంటా వస్తాయి. సియ్యముక్కలే అనుకొని నమల్తాయి. అంతే! ఉంటలు బాంబు పేలినట్లు పేల్తాయి. మూతి నజ్జునజ్జుగా పగిల్తే మెగాలు ఎక్కడివక్కడే పడి నిగిడి చస్తాయి."

"నువ్వుచెప్పేది బాగానే ఉండాది బావా! అయితే ఈ ఉంటల్ను ఆట్టామాదిరి గెనాల మింద పెడ్తే తెల్సో తెలవకో మణిసి తొక్కేస్తే?..."

"వాడిగెతీ అంతే!"

ఆమాట మనసులో మెదిలే సరికి సిద్దులుగాడు మీసం మెలేశాడు. మళ్ళీ ఒకసారి మామిడి ముట్టెల్ని మనసారా ముద్దుపెట్టుకొన్నాడు. తన పథకానికి తిరుగులేదన్న ధీమా కండ్లల్లో, కాంతులుగా మారి గుడిసింటికే వెలుగు తెచ్చింది.!...

బసిరెడ్డి కూడా బయలుదేరాడు. సిద్దులుగాడు చెవిలో వేసిన వార్త అమాంతంగా రెడ్డిగారి వయస్సును రెండు పదుల వెనక్కు నెట్టింది.

రెడ్డి గారు అడుగు తీసి అడుగు వేస్తుంటే దర్జా ఉట్టి పడుతూ ఉంది. అతని ముఖం సంజ వెలుగుల్లో కొత్త అందాన్ని సంతరించుకొంటూ ఉంది. అతని గుండెల నిండుకు ఆనందం తొణికిసలాడుతూ ఉంది.

ఇల్లు చేరాడు బసిరెడ్డి!

ఇంట్లో ఎవరైనా ఎందుకైనా పలకరిస్తే చిరాకు. స్థిమితంగా కాసేపు మనసు పెట్టి ఆలోచించాలంటే పరాకు. నాలుగు ముంతల నీళ్లతో ఒళ్ళు కడుక్కోవాలంటే తొందర. అన్నం ముందు కూర్చుంటే కోడి గెలుకుళ్లు!....

ఆ వయస్సులో కూడా తనలో కలుగుతున్న అనుభూతికి తనలో తానే నవ్వుకొంటున్నాడు బసిరెడ్డి.

తొలిజాము దాటింది.

మెత్తటి పరుపు ముండ్ల పొదలా పొందనంటూ ఉంది.

కాలం ముందుకు నడవలేనంటూ మొండికేసినట్లుంది.

నిగ్రహించుకోలేక పడకమీద అటూ ఇటూ పొర్లుతున్నాడు.

తొలిజాము తుది ఘడియలో బసిరెడ్డి పైకి లేచాడు. పిల్లిలా అడుగులు వేస్తూ మెల్లగా బయటపడ్డాడు.

చలికాలం. శుక్లపక్షం. తొలినాటి చంద్రుడు అలా తొంగి చూసి ఎప్పుడో వెళ్ళిపోయాడు. కన్ను పొడుచుకున్నా కానరాని చీకటి. అంత రాత్రి పూట వీధుల్లో ఎవరూ ఎదురు పడరని నమ్మకమున్నా - ఎందుకో బసిరెడ్డి బెదురు జింకలాగా దిక్కులు చూస్తూ నడుస్తున్నాడు. ఊర కుక్కలు కూడా చలికి తిన్నెల మాటున ముడుక్కున్నాయి. నిద్ర పట్టని ఒకటీ అరా ముసలి కుక్కలు అతని రాకను గమనించినా మొరగలేదు. ఓపిక లేకనేమో? - 'బ్రతుకు జీవుడా!' అని పెద్దబావి గట్టుకు చేరాడు బసిరెడ్డి.

ఆకు అలా అల్లాడితే అదిరి పడుతున్నాడు బసిరెడ్డి! - 'సిద్దులుగాడు వస్తాడో? రాడో? ... వాణ్ణి నమ్మి ఎంత సిగ్గుమాలిన పని చేసినానో?' అనుకొనే సరికి బసిరెడ్డి నీళ్ళుగారి పోయాడు. ఊపిరి పీల్చి వదలడం కూడా యాతనగా ఉంది.

ఎక్కడ నిలబడి చూస్తున్నాడో? ఏమో! సిద్దులుగాడు! గసపోసుకుంటూ వచ్చి రెడ్డిగారి ఎదుట నిలబడ్డాడు. రెడ్డి గారి ముఖం చేటంతయింది.

"అయ్యా! జాగర్తగా నా ఎనకాలే రావాల. ఈ సీగిట్లో ఎట్టా నడస్తారో ఏమో?... గుస

గుసమని చెవిలో ఊదాడు సిద్ధులుగాడు.

ఫరవా లేదన్నట్లుగా తల ఆడించాడు బసిరెడ్డి! । సిద్ధులుగాడు ముందు... రెడ్డి గారు వెనుక... చేతిలో మేత చూస్తున్న మేక పిల్లలా వాడి వెంటపడ్డాడు.!!

❊ ❊ ❊ ❊

తెల్లారింది!

"బసిరెడ్డి చచ్చిపోయ్‌నాడంట్నే"...

ఆ పల్లెలో ఎవరి నోట విందామన్నా ఇదే మాట!

చుట్టుప్రక్కలపల్లెల నుండి గుంపులు గుంపులుగా వస్తున్నారు జనం కడసారిగా బసిరెడ్డిని చూచిపోదామని!

అందరికీ ఒక్కటే సందేహం!...

"అంత రాత్రి పూట బసిరెడ్డి ఇల్లు విడిచి ఎందుకు వెళ్ళినట్టు? అదిగూడా కానమాకుల బావి జొన్న చేల దగ్గరికే ఎందుకు వెళ్లాడు?. మణిసి తోడు లేకుండా అడుగుపెట్టని మణిసి అంత రాత్రిపూట ఎందుకు ఒంటిరిగా వెళ్లినట్టు? వెళ్ళినా ఆ గెనిమల మిందనే ఎందుకు నడిచినాడో? నడిచినా రెండు మూడు ఉంటల్నే ఎట్లా తొక్కినాడో?" ఈ సందేహాలతో ఆ పల్లె సతమతమై పోతూ ఉంది.

ఎంత ఆరా తీసినా ఆ ఉండల్ని అక్కడ ఎవరు పెట్టారో? - అది గూడా ఒకటికి మూడు ఉండలు ఒక్క చోటనే ఎందుకు పెట్టారో? ఒక దాన్ని తొక్కి కింద పడిన మనిషి సరిగ్గా రెండు ఉండల మీదనే ఎలా పడ్డాడో? ఎంత ఆలోచించినా ఎవరికీ అంతు చిక్కలేదు.

రెడ్డి గారి మిద్దెలో కాకి శోకంగా ఉంది.

'పాతప్పలోడి' పూరి గుడిసెలో ఓ నడివయసు ఆడది పిచ్చిగా తనలో తానే నవ్వుకుంటూ ఉంది.

"ఒరే! ఆపాతప్పలోడి అప్పు తీరనట్లుండాదిరా! ఆలోకంలో తీర్చుకుందామని బసిరెడ్డిని యీడ్చుక పోయ్‌నట్టుండాదిరా!" ఆ ఊళ్ళో అక్కడక్కడ గుంపులు చేరిన జనం గుసగుసలు పోతున్నారు.

సిద్ధులుగాడు దోర్నం పట్టి మీద దర్జాగా నిలబడుతున్నాడు. తెంపుగా బావిలోకి దూకుతున్నాడు. గట్టుపైకెక్కుతున్నాడు. దోర్నంపట్టె మీద నిలబడుతున్నాడు. బావిలో దూకుతున్నాడు. మళ్లీ మళ్లీ దూకుతున్నాడు.

ఎన్నిసార్లు దూకినా ఏం ప్రయోజనం?

ఈ వ్యవస్థ వాడిని పైకి కనిపించని పోలీస్‌వాడి దెబ్బల మాదిర్తో కొంచెం కొంచెంగా కాలుస్తూ ఉంటే - ఇన్ని కాదు ఇంకెన్ని సార్లు దూకినా వాడి వొంటిమీద మంటలు చల్లారవు వాడు ఈ వ్యవస్థపై దూకేదాకా!.

*-ఆంధ్రభూమి (2-4-1981)*



5.